ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలి



కాచిగూడ: పెండింగ్‌లోని ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం సత్వరమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో హిమాయత్‌నగర్ వై జంక్షన్ వద్ద విద్యార్థులు, యు వత ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ఆర్.బాలకృష్ణ, కార్యదర్శి నెర్లకంటి శ్రీకాంత్‌లు మాట్లాడుతూ గత మూడు సంవత్సరాలుగా ప్రభుత్వం విద్యార్థులకు ఫీజులు విడుదల చేయకపోవడంతో విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశా రు. రాష్ట్రంలో కళాశాల ఫీజులు, స్కాలర్‌షిప్స్ కోసం 12.50 లక్షల మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని వారు పేర్కొన్నారు. విద్యార్థుల ఫీజు బకాయిలు, స్కాలర్ షిప్స్ వెంటనే చెల్లించాలని లేకపోతే తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని వా రు ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

ఉచిత ఫొటోగ్రఫీ డిప్లొమా కోర్సు

కాచిగూడ: నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర భాష, సాంస్కృతిక శాఖ, సిగ్మా అకాడమీ ఆఫ్ ఫొటోగ్రఫీ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత ఫొటోగ్రఫీ డిప్లొమా కోర్సులు నిర్వహిస్తున్నామని తెలంగాణ భాష, సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ వెల్లడించారు. బుధవారం 'రెండవ బ్యాచ్' ఉచిత ఫొటోగ్రఫీ డిప్లొమా కోర్సు వాల్ పోస్టర్‌ను అకాడమీ చైర్మన్ ఎం.సీ.శేఖర్, కె.జనార్దన్‌లతో కలిసి మామిడి హరికృష్ణ ఆవిష్కరించారు. అనంతరం హిమాయత్‌నగర్‌లోని అకాడమీలో జరిగిన కార్యాక్రమంలో ఆయన మాట్లాడుతూ యువత ఫొటోగ్రఫీ నేర్చుకోవడం పట్ల ఉత్సాహంగా ఉంటే వారు ఈ సమగ్ర ఉచిత ఫొటోగ్రఫీ డిప్లొమా కోర్సును పూర్తి చేసిన తర్వాత ఉపాధి పొందవచ్చునని తెలిపారు. నవంబర్ 14వ తేదీ నుంచి శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయని తెలిపారు.

అర్హత లేని ఏజెన్సీలను రద్దు చేయాలి



జేసీఎల్ సునీతను కలసి వినతిపత్రం అందజేస్తున్న యూనియన్ అధ్యక్షుడు నారాయణ, నేతలు

చిక్కడపల్లి: వాటర్‌వర్క్స్‌లో అర్హత లేని ఏజెన్సీలను రద్దు చేయాలని హెచ్‌ఎండబ్ల్యూఎస్ కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు నారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని కార్మిక శాఖ కమిషనర్ కార్యాలయంలో సంయుక్త కార్మిక కమిషనర్ సునీతను కలసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... హెచ్‌ఎండబ్ల్యూఎస్ ఎస్‌బీలో పనిచేసే ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని అన్నారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల కార్యకలాపాలను నిర్వహించే ఏజెన్సీల కాలపరిమితి పూర్తయితే పొడగించడంలో అంతర్యం ఏమిటని ప్రశ్నించారు. వెంటనే ఓపెన్ టెండర్లను పిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి కిరణ్‌కుమార్, నేతలు శ్రీనివాస్‌రెడ్డి, సంతోష్, బాలకృష్ణారెడ్డి, బాలరాజ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కుల గణనతో సామాజిక న్యాయం



అంబర్‌పేట ఆలీకేఫ్ చౌరస్తాలో పూలే విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న మాజీ ఎంపీ వీహెచ్

అంబర్‌పేట: బడుగుబలహీన వర్గాలకు కులగణనతోనే సామాజిక న్యాయం జరుగుతుందని మాజీ ఎంపీ వి.హనుమంతురావు అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి చొరవతో రాష్ట్ర ప్రభుత్వం కుల గణన చేపట్టడం హర్షణీయమని పేర్కొన్నారు. రాష్ట్రంలో కులగణన ప్రక్రియ మొదలైన సందర్భంగా బుధవారం ఆలీకేఫ్ చౌరస్తాలో ఉన్న మహాత్మ జ్యోతిరావుపూలే విగ్రహానికి బీసీ సంఘాలతో కలిసి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వీహెచ్ మాట్లాడుతూ.. జనాభాకు అనుగుణంగా బీసీలకు న్యాయం జరగడంలేదని అన్నారు. కులగణనతో సామాజిక న్యాయం దక్కుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, నాయకులు గుజ్జ కృష్ణ, బాలరాజ్‌గౌడ్, ఆర్.లక్ష్మణ్‌యాదవ్, పి.జ్ఞానేశ్వర్‌గౌడ్, శంభుల శ్రీకాంత్‌గౌడ్, దిడ్డి రాంబబు, గరిగంటి రమేశ్, ఆస్తార్ యూసుఫ్ జానీ, తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి



దిల్‌సుఖ్‌నగర్‌లో రాస్తారోకో చేస్తున్న విద్యార్థులు, పీడీఎస్‌యూ నాయకులు

మలక్‌పేట: ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే చేయాలని బుధవారం పీడీఎస్‌యూ గ్రేటర్ హైదరాబాద్ కమిటీ ఆధ్వర్యంలో దిల్‌సుఖ్‌నగర్‌లో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రేటర్ అధ్యక్షుడు మంద నవీన్ మాట్లాడుతూ.. విద్యార్థుల బలిదానాలతో కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో విద్యారంగాన్ని విస్మరించిన కేసీఆర్‌ను గద్దె దింపి, కాంగ్రెస్‌కు అధికారం ఇస్తే సీఎం రేవంత్‌రెడ్డి విద్యారంగంపై సమీక్ష జరుపలేదన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేట్ విద్యా సంస్థలకు కొమ్ము కాస్తూ.. ప్రజా ప్రభుత్వం అని చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. పాలకులు మారినా విద్యార్థుల సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. రాస్తారోకోతో రోడ్డుకు ఇరువైపులా ట్రాఫిక్ జామ్ అయింది. కార్యక్రమంలో శ్యామ్, సజా,రమేష్, సురేష్, ఝాన్సీ పాల్గొన్నారు.

పైసా వసూల్.. నిబంధనలు బేఖాతర్

- నివాస బహుళ అంతస్తుల్లో హాస్టళ్లు
- ట్రేడ్ లైసెన్స్ లేకుండానే నిర్వహణ
- ప్రభుత్వ ఆదాయానికి గండి



మూసారంబాగ్‌లోని ఓ ప్రైవేట్ హాస్టల్

మలక్‌పేట: దిల్‌సుఖ్‌నగర్, మూసారంబాగ్, గడ్డిఅన్నారం ప్రాంతాల్లో ప్రైవేటు హాస్టళ్లు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. నిబంధనలకు పాతరేసి హాస్టళ్ల నిర్వాహకులు ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. ఫ్రీ వైఫై, ఫ్రీ జిమ్ ఇలాంటి ఆఫర్లు పెడుతూ.. కమర్షియల్ బిల్డింగ్‌లలో కాకుండా నివాస ప్రాంతాల్లోని బహుళ అంతస్తుల భవనాల్లో హాస్టళ్లను ఏర్పాటు చేస్తూ బల్దియాకు రావాల్సిన రూ.లక్షల ఆదాయాన్ని ఎగ్గొడుతున్నారు. సంబంధిత శాఖ అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తి చూడటం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. భద్రతా ప్రమాణాలు పాటించకుండా కొందరు కనీస సౌకర్యాలు కల్పించకుండానే హాస్టళ్లను కొనసాగిస్తున్నారు.

ట్రేడ్ లైసెన్స్ లేకుండానే..

మలక్‌పేట పీఎస్ పరిధిలో దిల్‌సుఖ్‌నగర్, గడ్డి అన్నారం, మూసారంబాగ్, ఆస్మాన్‌ఘడ్ ప్రాంతాల్లో వందల సంఖ్యల్లో ప్రైవేట్ హాస్టళ్లు కొనసాగుతున్నాయి. సరైన సదుపాయాలు, కొన్ని చోట్ల వాచ్‌మెన్ లేకపోవడంతో పాటు ఇతర రక్షణ చర్యలు ఉండవు. నివాస ప్రాంతాల్లోని బహుళ అంతస్తు భవనాల్లో హాస్టళ్ల ఏర్పాటు చేసి కోచింగ్‌లు, ఉద్యోగాల కోసం వచ్చిన వారి నుంచి ఫీజుల రూపంలో భారీగా వసూలు చేస్తున్నారు. హాస్టళ్లు ఏర్పాటు చేయాలంటే జీహెచ్‌ఎంసీ లైసెన్స్, ఫైర్‌శాఖ అనుమతులు తీసుకోవాల్సి ఉండగా, ఏ ఒక్కరూ కూడా లైసెన్స్ తీసుకోకుండా స్థానిక నాయకుల అండదండలతో కొనసాగిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

నివాస భవనాల్లో..

కమర్షియల్ భవనాల్లో హాస్టళ్ల ఏర్పాటు చేయాలనే నిబంధన ఉంది. ఇలా చేస్తే ప్రభుత్వానికి పెద్ద మొత్తంలో డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది. దీనిని తప్పించుకునేందుకు నివాస ప్రాంతాల్లో హాస్టళ్ల ఏర్పాటు చేస్తున్నారు. హాస్టళ్లల్లో బ్యాచిలర్ ఉద్యోగులు, విద్యార్థులు, పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే వారు ఎక్కువగా ఉంటున్నారు. వారి ఐడీ కార్డు, ఆధార్ కార్డు పూర్తి వివరాలు తీసుకుని భద్రత పర్చాలి. సంబంధిత పోలీసులకు వివరాలు అందజేయాల్సి ఉండగా వాటిని సైతం విస్మరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

తీవ్రంగా డ్రైనేజీ సమస్య ..

దిల్‌సుఖ్‌నగర్, గడ్డిఅన్నారం ప్రాంతాల్లో ప్రైవేట్ హాస్టళ్ల నిర్వహణతో తీవ్రమైన డ్రైనేజీ సమస్య తలెత్తుతోంది. నివాస సముదాయాల్లో హాస్టళ్ల ఏర్పాటు చేయడంలో జనాభా పెరగటం మూలంగా పైపులైన్లలో మురుగు నీటి ఉద్ధృతి ఎక్కువై డ్రైనేజీ మ్యాన్‌హోళ్ల వద్ద మురుగు పొంగిపొర్లుతోంది. అంతేగాక వ్యర్థాలు డ్రైనేజీలో వేస్తుండటంతో డ్రైనేజీ జామై ఆయా ప్రాంతాల్లోని రోడ్లపై మురుగు ఏరులై పారుతూ దుర్గంధంగా మారుతున్నాయి.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలే..



ఇటీవల బాధ్యతలు తీసుకున్నాను. పూర్తి వివరాలు అందుబాటులో లేవు. అవసరమైతే ప్రైవేట్ హాస్టళ్లపై స్పెషల్ డ్రైవ్ చేపడుతాం. ట్రేడ్ లైసెన్స్ లేని వారికి జరిమానా విధిస్తాం. ప్రతి ఒక్కరూ ట్రేడ్ లైసెన్స్ తీసుకునేలా అవగాహన కల్పిస్తాం. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు. – అనురాధ, ఏఎంహెచ్ఓ

బీఆర్‌ఎస్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా మోజేస్



రావులపాటి మోజేస్

కవాడిగూడ: బీఆర్‌ఎస్ పార్టీ నగర ఆర్గనైజింగ్ సెక్రటరీ (కార్యనిర్వాహక కార్యదర్శి)గా ముషీరాబాద్ నియోజకవర్గానికి చెందిన రావులపాటి మోజేస్‌ను ఎమ్మెల్యే ముఠాగోపాల్ నియమించారు. బుధవారం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాంనగర్ డివిజన్ అధ్యక్షుడిగా ఉన్న ఆయన పార్టీకి చేసిన సేవలను గుర్తించి నగర కార్య నిర్వాహక కార్యదర్శిగా నియమించినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. తనపై నమ్మకం ఉంచి నగర కమిటీలో స్థానం కల్పించిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

పండగ శుభాకాంక్షలు



కాచిగూడ: మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్, టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్‌గౌడ్‌లను బుధవారం తెలంగాణ గౌడ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు పల్లె లక్ష్మణ్‌రావుగౌడ్ ఆధ్వర్యంలో హైదరాబాద్ కల్లు గీత సొసైటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి దసరా శుభాకాంక్షలు తెలియజేశారు. తెలంగాణ గౌడ సంఘం హైదరాబాద్ అధ్యక్షుడు దేవేందర్‌గౌడ్, రాములు, శ్రీనివాస్, సురేష్, శ్రీను, మహేందర్, సభ్యులు పాల్గొన్నారు.

రేపు కార్లకు వేలం పాట

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్ ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న 4 కార్లను ఈ నెల 18(రేపు) ఉదయం 10.30కు సరూర్‌నగర్ ఎక్సైజ్ పోలీస్ కార్యాలయంలో వేలం వేస్తున్నట్లు సరూర్‌నగర్ సీఐ శ్రీనివాస్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్నవారు వేలం పాటలో పాల్గొనవచ్చన్నారు.

మత సామరస్యానికి ప్రతీక గ్యార్వీ ఉత్సవాలు



బీఆర్‌ఎస్ యువనేత ముఠా జైసింహ, వై.శ్రీనివాస్‌రావు తదితరులు

కవాడిగూడ: గ్యార్వీ ఉత్సవాలు మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తున్నాయని బీఆర్‌ఎస్ యువనేత ముఠా జైసింహ అన్నారు. బుధవారం భోలక్‌పూర్ డివిజన్‌లోని బంగ్లాదేశ్ మార్కెట్‌లో బీఆర్‌ఎస్ నాయకుడు జహంగీర్ ఆధ్వర్యంలో గ్యార్వీ షరీఫ్ ఉత్సవాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ముఠా జైసింహ ముస్లింలతో కలిసి సామూహిక ప్రార్థనలు చేశారు. అనంతరం పీర్లకు దట్టీలు సమర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడుతూ... పండుగలను ఇరువర్గాల ప్రజలు ఐక్యంగా జరుపుకోవడం అభినందనీయమన్నారు. బీఆర్‌ఎస్ భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు, మైనార్టీ రాష్ట్ర నాయకులు రహీం, మైనార్టీ కమిటీ డివిజన్ అధ్యక్షుడు మగ్బూల్, మీడియా సెల్ ఇన్‌చార్జి ప్రవీణ్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా దుకాణాలకు దరఖాస్తు చేసుకోవాలి



ఇన్‌స్పెక్టర్ రాజు

చాదర్‌ఘాట్: నగర పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు దీపావళి సందర్భంగా తాత్కాలిక బాణసంచా విక్రయ దుకాణాల కోసం ఈ నెల 26 లోగా దరఖాస్తు చేసుకోవాలని చాదర్‌ఘాట్ ఇన్‌స్పెక్టర్ రాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దరఖాస్తులను పరిశీలించి ఆయా డీసీపీల ద్వారా లైసెన్స్‌లు జారీ అవుతాయన్నారు. డివిజనల్ ఫైర్ ఆఫీసర్ నుంచి, ప్రభుత్వ స్థలమైతే జీహెచ్‌ఎంసీ నుంచి, ప్రైవేటు వ్యక్తుల స్థలమైతే ఆయా యజమాన్యాల నుంచి ఎన్‌ఓసీ, అగ్రిమెంట్ కాపీలు, గతేడాది జారీ చేసిన లైసెన్స్ ఉంటే ఆ కాపీని జతపర్చాలన్నారు. సింగిల్ దుకాణం అయితే పక్కవారి నుంచి ఎన్‌ఓసీ, షాప్ సైట్ ప్లాన్ రూ.600 లైసెన్స్ ఫీజు గన్‌ఫౌండ్రీలోని ఎస్‌బీహెచ్‌లో హెడ్ అకౌంట్‌లో జమ చేయాలని సూచించారు. డాక్యుమెంట్లు దరఖాస్తుతో పాటు లేకుంటే ఆయా అర్జీలను తిరస్కరిస్తామన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు



మల్లికార్జుననగర్‌లో డ్రైనేజీ సమస్యను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పద్మ

అంబర్‌పేట: తాగునీటి సమస్య నివారణకు అధికారులు ఎప్పటికప్పుడు తగిన చర్యలు చేపట్టాలని బాగ్ అంబర్‌పేట డివిజన్ కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి సూచించారు. బుధవారం డివిజన్‌లో మల్లికార్జుననగర్‌లో కనిష్ఠ తాగునీరు, డ్రైనేజీ సమస్యపై స్థానికుల ఫిర్యాదు మేరకు జలమండలి అధికారులతో కలిసి ఆమె పరిశీలించారు. మౌలిక సమస్యల పరిష్కారంతో అధికారులు జాప్యం చేయకూడదన్నారు. శాశ్వత పరిష్కారానికి ప్రతిపాదనలు రూపొందిస్తే వాటి మంజూరుకు కృషి చేస్తామన్నారు. జలమండలి అధికారులు, స్థానిక బీఆర్‌ఎస్ నేతలు పాల్గొన్నారు.

ఓయూ వీసీగా మాల ప్రొఫెసర్‌ను నియమించండి

ఆల్ మాల స్టూడెంట్స్ అసోసియేషన్ డిమాండ్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూకు మాల ప్రొఫెసర్‌ను వీసీగా నియమించాలని ఆల్ మాల స్టూడెంట్స్ అసోసియేషన్ (అంసా) రాష్ట్ర అధ్యక్షుడుఅంగిరి ప్రదీప్, ప్రధాన కార్యదర్శి మంచాల లింగస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఓయూలో జరిగిన అంసా సమావేశంలో వారు మాట్లాడుతూ ఓయూను ప్రారంభించేందుకు రెండు వేల ఎకరాల భూమిని దానం ఇచ్చిన లఖాభాయ్ చందా కూడా మాల సామాజిక వర్గానికి చెందిన మహిళ అని గుర్తు చేశారు. కానీ, 107 ఏళ్ల ఓయూ చరిత్రలో ఇంతవరకు ఎస్సీలకు వీసీ పదవి దక్కకపోవడం శోచనీయమన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఓయూ చరిత్రను పూర్తిగా అధ్యయనం చేసి మాల అధ్యాపకులకు వీసీగా అవకాశం ఇవ్వాలన్నారు.

ప్రొఫెసర్ పురుషోత్తం నియామకంపై హర్షం


ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్ర ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్‌గా ఓయూ ప్రొఫెసర్ ఇటిక్యాల పురుషోత్తం నియామకంపట్ల తెలంగాణ స్టూడెంట్ పొలిటికల్ జాక్ వ్యవస్థాపక అధ్యక్షుడు, ఓయూ రీసెర్చ్ స్కాలర్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు వలిగొండ నరసింహ బుధవారం హర్షం వ్యక్తం చేశారు. దళిత బహుజన సామాజిక వర్గానికి చెందిన పురుషోత్తం పొలిటికల్ జేఏసీ నేతగా తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. పురుషోత్తం సేవలను గుర్తించి వైస్ చైర్మన్‌గా నియమించినందుకు సీఎం రేవంత్‌రెడ్డికి విద్యార్థుల తరపున కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు వలిగొండ నరసింహ పేర్కొన్నారు.

ఇరిసెట్‌లో ముగిసిన స్వచ్ఛత పఖ్వాడ



లాలాపేట: తార్నాకలోని ఇండియన్ రైల్వేస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సిగ్నల్ ఇంజనీరింగ్ అండ్ టెలీ కమ్యూనికేషన్స్(ఇరిసెట్)లో గత కొన్ని రోజులుగా కొనసాగుతున్న స్వచ్ఛత పఖ్వాడ కార్యక్రమాలు బుధవారం ముగిశాయి. ఈ సందర్భంగా స్వచ్ఛత ప్రాముఖ్యతపై పలు సాంస్కృతిక, క్రీడా పోటీలు నిర్వహించారు. విజేతలకు ఇరిసెట్ డైరెక్టర్ జనరల్ శరద్‌కుమార్ శ్రీవాత్సవ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ట్రైనీ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

యోగవాసిష్టం పురాతన గ్రంథాల్లో ఒకటి





ప్రవచనం చేస్తున్న పద్మశ్రీ డాక్టర్ గరికపాటి నరసింహారావు, ప్రవచనాలకు హాజరైన భక్తులు

నల్లకుంట: యోగవాసిష్టం(గురుతత్వం) అద్వైత వేదాంతంలోని ముఖ్యమైన గ్రంథాలలో ఒక పురాతన భారతీయ గ్రంథం అని మహా సహస్రావధాని, పద్మశ్రీ డాక్టర్ గరికపాటి నరసింహారావు అన్నారు. ఈ గ్రంథం ఒక తత్వశాస్త్రం అని పేర్కొన్నారు. శ్రీ షిరిడీ సాయిబాబా సంస్థాన్ ఆధ్వర్యంలో బుధవారం (రెండో రోజు) సాయంత్రం బాగ్ అంబర్‌పేటలోని శ్రీ షిరిడీ సాయిబాబా మందిరంలో 'యోగవాసిష్టం'అనే అంశంపై ప్రవచనాలు కొనసాగాయి.

- ఈ సందర్భంగా డాక్టర్ గరికపాటి నరసింహారావు 'యోగవాసిష్టం'పై ప్రవచిస్తూ.. యోగవాసిష్టం అనేది అద్వైతానికి సంబంధించిన పురాతన భారతీయ గ్రంథమని పేర్కొన్నారు. వశిష్ఠ మహర్షి పేరిట ఉన్న ఈ గ్రంథంలో మొత్తం ఆరు అధ్యాయాలు ఉన్నాయని తెలిపారు. అరుంధతి, వశిష్టుని కథతో ఈ గ్రంథం ప్రారంభమవుతుందని చెప్పారు.
- మొదటి అధ్యాయంలో శ్రీరాముని జీవితం, ప్రాపంచిక విషయాల పట్ల వైరాగ్యం, రెండో అధ్యాయంలో రాముడి వ్యక్తిత్వం, మోక్షం పొందడానికి కావాల్సిన గుణాలు ఉంటాయని తెలిపారు. ఈ ప్రవచన కార్యక్రమం గురువారం(నేడు) ముగుస్తుందని సంస్థాన్ ప్రతినిధులు తెలిపారు.

బీజేపీ ఎస్సీ మోర్చా హాస్టల్స్ కన్వీనర్‌గా మల్లేష్

కాచిగూడ: బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర ఎస్సీ హాస్టల్స్ కన్వీనర్‌గా నారాయణగూడ, రాజ్‌మోహల్లా ప్రాంతానికి చెందిన నెరిడి మల్లేష్‌ను నియమించినట్లు ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ ప్రకటించారు. రాష్ట్రంలో ఎస్సీ కులాలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి ప్రజా ఉద్యమాలు చేపట్టడం ద్వారా పార్టీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేయడానికి కృషి చేయాలని ఆయన సూచించారు.

దేవాలయాలపై దాడులను ఖండించండి !

కాచిగూడ: గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో గత కొంత కాలంగా హిందూ దేవాలయాలపై జరుగుతున్న దాడులను ప్రతి ఒక్క హిందువు ఖండించాలని బీజేపీ సీనియర్ నేత పొట్లకాయల వెంకటేశ్వర్లుముదిరాజ్ పిలుపునిచ్చారు. హిందువులందరూ సంఘటితమై దాడులకు పాల్పడుతున్న వారికి తగిన గుణపాఠం చెప్పాలని, లేదంటే హైదరాబాద్ నగరంలో రానున్న రోజుల్లో హిందువులు జీవించడం కష్టంగా మారుతుందన్నారు. కుమ్మరిగూడలో ముత్యాలమ్మ దేవాలయంపై జరిగిన దాడిని ఆయన ఓ ప్రకటన ద్వారా ఖండించారు. హిందూవులంతా తమ ఐక్యతను చాటి సంఘటితం కావాలని పిలుపునిచ్చారు.

ఫీజు బకాయిలు చెల్లించాలి

కాచిగూడ: పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల ఫీజు బకాయిలు, స్కాలర్‌షిప్స్‌ను వెంటనే విడుదల చేయాలని బీజేవైఎం రాష్ట్ర స్టడీ సర్కిల్ కన్వీనర్ కన్నెబోయిన రాముయాదవ్ డిమాండ్ చేశారు. బుధవారం బర్కత్‌పురలో ఆయన మాట్లాడుతూ.. గత నాలుగేళ్లుగా విద్యార్థుల ఫీజు బకాయిలు, స్కాలర్‌షిప్స్ రూ.7,500 కోట్ల వరకు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. రాష్ట్రంలో విద్యార్థులు, యువత ఓట్లతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకపోవడం దారుణమన్నారు. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ప్రభుత్వం చెల్లించకపోవడంతో విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి విద్యార్థుల జీవితాలు రోడ్డుపాలు కాకుండా ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే చెల్లించి ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. లేదంటే రాష్ట్రవ్యాప్తంగా మంత్రులు, ప్రజా ప్రతినిధులు, అధికారులను ఎక్కడికక్కడ విద్యార్థులు అడ్డుకుని, ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

హెబ్రోన్ చర్చి సొసైటీ సభ్యులపై కేసు కొట్టివేత

చిక్కడపల్లి: హెబ్రోన్ చర్చి నిర్వహణ విషయమై సొసైటీ సభ్యులైన వీరాచారి, అనుచరులపై పెట్టిన తప్పుడు కేసును హైకోర్టు కొట్టి వేసిందని క్రైస్తవ ధర్మ ప్రచార పరిరక్షణ సమితి అధ్యక్షుడు జెరూసలెం మత్తయ్య బుధవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల మాజీ ఎమ్మెల్సీ రాజేశ్వర్‌రావు, క్రిస్టియన్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్ తదితరులు ట్రస్ట్ సభ్యులపై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

పేదరిక నిర్మూలనకు ముందుకు రావాలి



అనాథమహిళకు అన్నం పెడుతున్న సొసైటీ సభ్యులు



వృద్ధాశ్రమంలో వృద్ధురాలికి అన్నం పెడుతున్న సభ్యురాలు

చిక్కడపల్లి: పేదరిక నిర్మూలనకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని సొసైటీ ఫర్ హంగర్ ఎలిమినేషన్ సొసైటీ ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ ప్రసాద్ అన్నారు. ప్రపంచ ఆహార భద్రత దినోత్సవం సందర్భంగా బుధవారం సొసైటీ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని లక్ష్మీసాయి చైతన్య వృద్ధాశ్రమంలో ఆహారంతో పాటు నిత్యావసర సరుకులను ఆయనే అందజేసి మాట్లాడారు. దేశంలో మహిళలు, చిన్నారులు, వృద్ధులు పోషకాహార లోపంతో బాధపడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి సీతాపతిరావు తదితరులు పాల్గొన్నారు.

మూసీ నిర్వాసితుల పిల్లలకు 'రెసిడెన్షియల్'లో అడ్మిషన్

చైతన్యపురి: మూసీ ప్రక్షాళనలో భాగంగా ఇళ్లు కోల్పోతున్న రెండు కుటుంబాలకు చెందిన ముగ్గురు విద్యార్థులకు తెలంగాణ రాష్ట్ర రెసిడెన్షియల్ పాఠశాలలో ప్రవేశం కల్పించారు. జీహెచ్‌ఎంసీ అర్బన్ కమ్యూనిటీ విభాగానికి చెందిన పీఓలు, ఆర్‌పీఓల కృషితో సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలో ఎలాంటి ప్రవేశ పరీక్ష లేకుండా ప్రవేశం కల్పించినట్లు సీపీఆర్‌ఓ ఓ ప్రకటనలో తెలిపారు. సరూర్‌నగర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూట్‌లో మాధవి (ఏడవ తరగతి), శిరీష (5వ తరగతి), తేజస్వి (5వ తరగతి)లో యూసీడీ అడిషనల్ కమిషనర్ చంద్రకాంత్‌రెడ్డి ఎడ్యుకేషనల్ సొసైటీ సెక్రటరీ ప్రశాంతితో మాట్లాడి ఉచిత విద్య పొందేలా ప్రత్యేక చొరవ తీసుకున్నారని తెలిపారు.

కులగణను స్వాగతిస్తున్నాం..

ఉస్మానియా యూనివర్సిటీ: కులగణను స్వాగతిస్తున్నామని ఓయూ ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థి సంఘాల నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా బుధవారం క్యాంపస్‌లోని పూలే, అంబేడ్కర్ స్టడీ సెంటర్‌లోని పూలే, అంబేడ్కర్ విగ్రహాలకు పాలాభిషేకం చేసిన్నట్లు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ పేర్కొన్నారు. బీసీ సంఘాల పోరాటాల ఫలితంగా కులగణన నిమిత్తం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డికి, టీపీసీసీ మహేష్ కుమార్‌గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వివిధ విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ వెంకటరమణ తొలగింపు హర్షణీయం

ఉస్మానియా యూనివర్సిటీ: బాసర ట్రిపుల్ ఐటీ ఇన్‌చార్జి వైస్ చాన్సలర్‌ప్రొఫెసర్ వెంకటరమణను పదవి నుంచి తొలగించడం పట్ల ఓయూ విద్యార్థి జేఏసీ అధ్యక్షుడు సర్దార్ వినోద్‌కుమార్ బుధవారం హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్‌గా కొనసాగుతూ ట్రిపుల్ ఐటీకి ఇన్‌చార్జి వీసీగా వ్యవహరించిన వెంకటరమణ విద్యార్థులను పలు విధాలుగా వేధింపులకు గురిచేశారని పేర్కొన్నారు. అనేక అవినీతి అక్రమాలకు పాల్పడిన వెంకటరమణపైన విజిలెన్స్ అధికారులతో విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆయనకు ఇక ఎలాంటి పదవులు ఇవ్వొద్దని ప్రభుత్వాన్ని కోరారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి,
వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు
మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220383